# నిర్భయవార్త

తెలుగు దినపత్రిక

NIRBHAYA VARTHA TELUGU DAILY

NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

సంపుటి : 13 సంచిక : 1312 రంగారెడ్డి | శనివారం 12 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 12-09-2026 | September | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada







# గణేష్ ఆగయా

## ఖైరతాబాద్ రెడీ!

- రేపటి నుంచి గణపతి దర్శనం
- 69 అడుగుల ఎత్తులో గణనాథుడు
- మండపం వద్ద భారీ ఏర్పాట్లు

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 14న వినాయక చవితి వేడుకలు జరగనున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం 12వ తేదీ నుంచే మహాగణపతి దర్శనాన్ని ప్రారంభించనున్నారు. ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకునేందుకు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

నిర్భయవార్త ప్రతినిధి :



### 69 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి

ఈ ఏడాది ఖైరతాబాద్‌లో 69 అడుగుల ఎత్తుతో పంచముఖ సంకటహర మహాగణపతి కొలువుదీరాడు. భారీ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా, పంచముఖ గణపతి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది. గణనాథుడి దర్శనానికి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

### సోమనాథ్.. కాళీమాత ప్రత్యేక ఆకర్షణ

మహాగణపతి విగ్రహానికి ఇరువైపులా ప్రత్యేక ఆధ్యాత్మిక నమూనాలను ఏర్పాటు చేశారు. ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు అమ్మవారి శక్తిరూపమైన కాళీమాత విగ్రహాలను అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన గణనాథుడితో పాటు ఈ ప్రత్యేక రూపాలు కూడా భక్తులను ఆకట్టుకోనున్నాయి.

### పర్యావరణహితంగా మహాగణపతి

ఈసారి గణనాథుడి విగ్రహాన్ని పర్యావరణహితంగా రూపొందించారు. సహజ నదీమట్టి, ఇసుక, వరి గడ్డి వంటి సహజ పదార్థాలను ఉపయోగించడంతో పాటు సేంద్రియ రంగులతో విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు తెలిపారు. నిమజ్జనం సమయంలో పర్యావరణంపై ప్రభావం తగ్గించేలా నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### నేడు ఘనంగా ఆగమన వేడుకలు

ఖైరతాబాద్ మహాగణపతి ఆగమన కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం శనివారం నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఇప్పటికే విగ్రహ నిర్మాణం పూర్తికావడంతో ఖైరతాబాద్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, ట్రాఫిక్, క్యూలైన్లు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



# అటవీ అమరవీరుల సంస్మరణ దినం

- వారి త్యాగాలు చిరస్మరణీయమన్న సీఎం రేవంత్

నిర్భయవార్త ప్రతినిధి : అటవీ సంపద, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ అమరులైన అటవీ శాఖ సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వారి సేవలను స్మరించుకున్నారు. అడవులు, వన్యప్రాణులను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన అటవీ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని సీఎం కొనియాడారు. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరవీరులు చూపిన మార్గంలో ముందుకు సాగుతూ అడవులను కాపాడాలని, వన్యప్రాణులను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని, భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# రూ.250 కోట్ల విలువైన భూమికి రూ.7 కోట్లా?




రంగారెడ్డి : నిర్భయవార్త ప్రతినిధి : సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి రూ. 250 కోట్ల విలువైన భూమిని రూ. 7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'ఈడీ, ఐటీ, సీబీఐలు మాపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు కనిపించడం లేదా' అని నిలదీశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రాంతంలో కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూములను గురువారం కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు. మరి తెలంగాణను కొల్లగొడు తున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారు...? ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని ప్రశ్నించారు. సీఎం కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా, ప్రయోజనాల సంఘర్షణ కాదా, కుటుంబ పాలన కాదా అని ఆయన నిలదీశారు. ఎనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ. 1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూము లు, మినహాయింపులు కల్పించే వ్యవహా రంపైనా ప్రశ్నలు సంధించారు. సీఎం సోదరుడి సంస్థ ఇజ్రాయిల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని అన్నారు. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. శాసనసభలో ఈ భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చేసి బయటకు పంపారని ఆరోపించారు. అందుకే మీ తమ్ముడికి ఇచ్చిన భూమి వద్దకే వచ్చామని, ఇక్కడి నుంచే ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నామని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయా జాలం నడుపుతున్నదని ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగిం చడం చట్టపరంగా ప్రశ్నార్థకమని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టీకరణ



నిర్భయవార్త ప్రతినిధి : వ్యవసాయ పంప్‌సెట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమని, ఉచిత విద్యుత్ కొనసాగుతుందని శాసనమండలిలో స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఎస్ పథకంలో వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన లేదని తెలిపారు. విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ, ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ అప్‌గ్రేడ్ కోసం కేంద్రం 60 శాతం గ్రాంట్ ఇస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఉదయ్ ఒప్పందానికి మించి ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సెప్టెంబర్ 9న రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని భట్టి తెలిపారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్, బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ద్వారా తక్కువ ధరకే విద్యుత్ అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల విద్యుత్ వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సోలార్ పంప్‌సెట్లను పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేస్తున్నామని, రైతులు అంగీకరించకపోతే ప్రస్తుత ఉచిత విద్యుత్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### ప్రభుత్వ ఉద్యోగులకు రూ.కోటి ఉచిత బీమా!

- రాష్ట్రంలో 12.91 లక్షల మందికి ప్రయోజనం
- ఇప్పటికే 89 కుటుంబాలకు పరిహారం
- శాసనమండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రూపాయి ప్రీమియం లేకుండా రూ.కోటి వరకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జీవో నంబర్ 77 ద్వారా అమలు చేస్తున్న ఈ పథకంతో రాష్ట్రంలో 12.91 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటివరకు 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం అందించినట్లు తెలిపారు. ఇందులో సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు 50, విద్యుత్ శాఖకు చెందినవి 15, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందినవి 24 ఉన్నాయని వివరించారు. బ్యాంకుల శాలరీ, పెన్షన్ ఖాతా ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని, ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం వంటి సందర్భాల్లో కవరేజ్ ఉంటుందని చెప్పారు. విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2.20 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా లభిస్తుందని వెల్లడించారు. ఈ పథకాన్ని తొలుత 2024 ఫిబ్రవరిలో సింగరేణి ఉద్యోగులకు, జూన్‌లో విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ఇతరులకు విస్తరించినట్లు భట్టి తెలిపారు.

నిర్భయవార్త
సంపాదకీయం
శనివారం 11 సెప్టెంబర్ 2026

# విరాళాల లోగుట్టు!

కార్పొరేట్లకు, కమలనాథులకు ఏర్పడ్డ బలమైన బంధానికి బిజెపి ఖాతాల్లోకి పారుతున్న విరాళాల వెల్లువ ఒక తిరుగులేని సాక్ష్యం. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలానికి సంబంధించి బిజెపి కేంద్ర కార్యాలయానికి రూ.1,472.8 కోట్ల మేర నిధులు వచ్చినట్టు తాజాగా వెల్లడైన లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్‌కు అందిన విరాళాలు రూ.207.17 కోట్లు. అస్సాంలో రూ.96.3 కోట్లు, తమిళనాడులో రూ.51.6 కోట్లు, పుదుచ్చేరిలో రూ.11.9 కోట్లు ఖర్చు చేసినట్టు బిజెపి అధికారికంగా చెబుతోంది. లెక్కలకెక్కని, లెక్కలు చెప్పని ధన ప్రవాహం ఎంతుంటుందో అంచనా వేయొచ్చు. రాజకీయాల్లో డబ్బు ఎవరి చేతిలో ఎంతగా కేంద్రీకృతమవుతుందో, ఎన్నికల పోరులో ఆర్థిక శక్తి ఎంతటి అసమానతను సృష్టిస్తుందో ఇది స్పష్టం చేస్తోంది. కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేసే బిజెపి... వారి నుంచి తిరిగి పొందుతున్న ప్రతిఫలానికి ఈ విరాళాల లెక్క ఒక కొండ గుర్తు. 2024-25లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అన్ని రాజకీయ పార్టీలకు రూ.3,826.35 కోట్లు చేరితే - అందులో రూ.3,157.65 కోట్లు, అంటే 82.52 శాతం బిజెపికే వెళ్లాయి. కాంగ్రెస్‌కు రూ.298.78 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.102 కోట్లు రాగా, మిగిలిన 19 పార్టీలు కలిపి రూ.267.92 కోట్లు జమయ్యాయి. ఈ నిధుల్లో 228 కార్పొరేట్, వ్యాపార సంస్థలు రూ.3,636.82 కోట్లు అందించాయి. పాలకవర్గ పార్టీల నిధుల వ్యవస్థలో కార్పొరేట్ ధనం ఎంతటి పాత్ర పోషిస్తోందో ఈ లెక్క చెబుతోంది. అదే విధంగా కార్పొరేట్ల ప్రయోజనాలకు ఆయా పార్టీలు ఎంతగా అంకితమవుతాయో, ప్రభావితమవుతాయో కూడా ఈ విరాళాలే వెల్లడిస్తాయి. సిపిఎం దాఖలు చేసిన కేసులో 2024లో సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసినప్పుడు... రాజకీయ విరాళాల్లో పారదర్శకత, ప్రజల హక్కు, కార్పొరేట్ నిధుల ప్రభావం వంటి అంశాలపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. వాటికి ఇంతవరకూ కేంద్రం నుండి తగిన సమాధానమూ లేదు, సవరించుకున్న వైనమూ లేదు. బాండ్ల మార్గం రద్దయినా పెద్ద మొత్తాల నిధుల ప్రవాహం ఆగలేదు. అధికారాన్ని దక్కించుకోవడానికి ఉన్మాద భావజాలాన్ని రెచ్చగొట్టే బిజెపికి ఇలా అపరిమితంగా వచ్చిపడే కార్పొరేట్ విరాళాలతో అది ఎన్నికల తీరును దారుణంగా మార్చేసింది! కోట్లు కురిపించి పోల్ మేనేజ్‌మెంటు చేయడం దగ్గర నుంచి గెలుపొందిన ప్రత్యర్థులను తమవైపు తిప్పుకోవటం వరకూ అధికార వ్యవస్థలను, ఆర్థిక బలాన్ని ఇష్టానుసారం వినియోగిస్తూ ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం! దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం. కాగా, గుజరాత్‌లో వెలుగులోకి వచ్చిన గుర్తింపు లేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల వ్యవహారం ఎన్నికల నిధుల వ్యవస్థలోని మరో చీకటి కోణాన్ని ముందుకు తెచ్చింది. కాగితాలకే పరిమితమైన ఆరు అనామక పార్టీలు 2023-24లో సుమారు రూ.1,700 కోట్ల విరాళాలు పొందటం ఆశ్చర్యకరం. ఆ పార్టీలన్నీ కలిపి 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సంఖ్య కేవలం 15. మరి ఈ అనామక పార్టీలకు ఇన్ని నిధులు ఎలా సమకూరాయి? దాని వెనుక ఉన్న ప్రయోజనాలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ప్రజల మధ్య పనిచేస్తూ, ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఎం కార్పొరేట్ సంస్థల విరాళాలను తీసుకోరాదని నిర్ణయించింది. పరిమిత వనరులతో పోటీ చేసే వామపక్ష పార్టీలకు ఒకవైపు నిధుల కొరత, మరోవైపు భారీ మొత్తాలు వెచ్చించగల పార్టీలకు అపారమైన ఆర్థిక శక్తి ఉండటం సమాన రాజకీయ పోటీకి విరుద్ధం. ఎన్నికలంటే ప్రజలతో చర్చ, విధానాలపై వాదన, ప్రత్యామ్నాయాల ప్రతిపాదన కావాలి. కానీ డబ్బు, మీడియా, ప్రచార యంత్రాంగం, భారీ సభలు, డిజిటల్ ప్రచారం అన్నీ ఒకే రాజకీయ శక్తి చేతుల్లో కేంద్రీకృతమైతే ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతుంది. అందుకే ఎన్నికల సంస్కరణలు తేవాల్సిన అవసరం చాలా ఉంది. కార్పొరేట్ విరాళాలు, పెద్ద మొత్తాల నిధులపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు రావాలంటే ఎన్నికలకు ప్రజా నిధుల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎన్నికల సంఘమే దీనికి కేంద్ర సంస్థగా ఉండాలి. ప్రచార సామగ్రి, సమావేశాలకు ప్రభుత్వ స్థలాలు, ముద్రణ, ప్రయాణం వంటి అవసరాలను అది సమకూర్చాలి. అదే సమయంలో కార్పొరేట్ విరాళాలకు కఠిన పరిమితులు, ప్రతి విరాళానికి పూర్తి పారదర్శకత, పార్టీల ఆదాయ--వ్యయాల తక్షణ బహిరంగ ప్రకటన, ఎన్నికల సమయంలో పార్టీలు చేసే ఖర్చుపై పరిమితి, ఉల్లంఘనలకు కఠిన చర్యలు ఉండాలి. ఎన్నికల్లో ఎవరి వద్ద ఎంత డబ్బుంది అన్నది కాదు, ప్రజలకు ఎవరి విధానం నచ్చింది అన్నదే నిర్ణయాత్మకం కావాలి. భారీగా విరాళాలు ఇచ్చే కార్పొరేట్ సంస్థలు ఆయా పార్టీల ప్రభుత్వాల నుంచి దొడ్డిదోవల్లో ప్రయోజనాలు పొందటాన్ని నివారించాలి. ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర వ్యవస్థలు అధికార పార్టీ చేతిలో ఆటబొమ్మలుగా మారిపోయిన వర్తమానంలో ఇలాంటి సంస్కరణలను ఆశించలేం కానీ, భవిష్యత్తులోనైనా ఎన్నికలు న్యాయబద్ధంగా జరగాలంటే మార్పులు కచ్చితంగా అవసరం. అందుకు పౌరులు, మేధావులు నిరంతర కృషి ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలి. ప్రజల ఓటును డబ్బు నుంచి, ప్రలోభాల నుంచి, ప్రచార మాయాజాలం నుంచి విముక్తం చేయడం ఇప్పుడు అత్యవసరమైన కర్తవ్యం.

# అడ్డా కూలీలుగా రైతులు..!

పాలమూరు తీరుగా మారిన కర్నూలు జిల్లా రైతన్నల బతుకులు ఈరోజు దయనీయ స్థితికి చేరుకున్నాయి. ఒకప్పుడు నలుగురికి అన్నం పెట్టిన చేతులు, నేడు కూలి పని కోసం కర్నూలు నగర వీధుల్లో ఆశగా ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. వర్షాభావం, ప్రకృతి వైపరీత్యాలు, అప్పుల ఊబి... అన్నీ కలిసి వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతులతో పాటు కౌలురైతుల నడుము విరిచాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సైతం రైతన్నల ఆశలపై కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ నేపథ్యంలో ఎ.పి రైతుసంఘం నిర్వహించిన కరువు పర్యటనలో ఎన్నో కఠోర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.రాయలసీమకు ముఖద్వారమైన కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్ర కరువును సృష్టిస్తున్నాయి. ఈ సంవత్సరం 'ఎల్‌నినో' ప్రభావంతో సరైన వర్షాలు కురవక వేసిన పంటలు పూర్తిగా ఎండి పోవడంతో రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో మొత్తం 10,87,760 ఎకరాల సాగు భూమి ఉండగా, ఈ ఏడాది కేవలం 7,56,340 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో ఒక్క పత్తి పంట సుమారు 5,42,125 ఎకరాల్లో (మొత్తం సాగైన భూమిలో 75 శాతం) వేశారు. రైతులు ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. మొక్కకు 50 నుంచి 60 కాయలు ఉండాల్సింది, బతికిన కొద్దిపాటి మొక్కలకు కేవలం 2 నుంచి 3 కాయలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మొక్కలు గిడసబారి పెరుగుదల లేకపోవడంతో పత్తి రైతులు అపార నష్టాలను చవిచూశారు.ఉల్లి పంట పరిస్థితి కూడా ఇలాగే ఉంది. జిల్లా వ్యాప్తంగా 7,960 ఎకరాల్లో ఉల్లి సాగైంది. కోడుమూరు మండలంలో ఈసారి 2,750 ఎకరాల్లో సాగు చేశారు. ఇందుకోసం ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు చేశారు. సుమారు రూ.13.75 కోట్లు ఖర్చు చేశారు. కనీసం ఒక్క రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. వేరుశనగ, మొక్కజొన్న, కొర్ర, మిరప, సజ్జ, ఆముదం, కంది తదితర పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయి. కొన్ని చోట్ల ఎండిన పంటలను గొర్రెల మేతకు వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. కోడుమూరు మండలంలోని ఒక్క వెంకటగిరి గ్రామంలోనే 1,600 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. మొత్తం పంట చేతికి రాని పరిస్థితి. ఇక్కడి రైతులు, కౌలు రైతులు ఇతర గ్రామాలకు పనులకు



పోతున్నారు. ఇదే గ్రామానికి చెందిన రైతు గిడ్డయ్య ప్రతి ఏడాది ఏడెకరాలు కౌలుకు చేస్తారు. ఐదెకరాల దాకా సొంత భూమి ఉంది. ఈసారి కరువు తాండవించడంతో రెండెకరాలు కౌలుకు తీసుకుని రూ.లక్షలు ఖర్చు చేసి ఉల్లి సాగు చేశారు. పూర్తిగా ఎండిపోయింది. గతేడాది చేసిన దాదాపు రూ.4 లక్షల అప్పు ఉంది. ఈసారి రూ.లక్ష ప్రైవేట్ వడ్డీకి తెచ్చారు. అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. కోడుమూరు ఆర్.టి.సి బస్టాండ్ హమాలీగా మూటలు మోయడానికి వెళ్తున్నారు. చంద్రన్న అనే రైతుకు ఎకరన్నర సొంత భూమి వుంది. ఇదిగాక ఐదెకరాలు కౌలుకు చేశారు. ఉల్లి సాగు చేయగా పూర్తిగా ఎండిపోయింది. పూట గడవక అడ్డా కూలీగా మారారు. భూపాల్ తిప్పారెడ్డికి 20 ఎకరాలు ఉంది. 13 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. నాలుగు ఎకరాలు కంది సాగు చేశారు. మరో మూడు ఎకరాలు బీడుగా వదిలేశారు. 'మొత్తం సాగు చేయకపోయినా బాగుండేది. ఆశతో రూ.లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. వర్షం లేక మొత్తం ఎండిపోయింది. ఏదయినా ఒక వర్షం పడితే అక్టోబరులో శనగ సాగు చేస్తాన'ని అంటున్నారు. 'పంటలు చేతికొస్తే పిల్లల చదువులు సాఫీగా సాగుతాయని ఆశ పడ్డాను. ఇద్దరు పిల్లలు హైదరాబాద్ లో బిటెక్ చదువుతున్నారు. అప్పులెలా తీర్చాలో, వారి చదువులెలా గట్టెక్కించాలో అర్థం కావడం లేద'ని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా ఏ రైతును కదిలించినా వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.ఇంతటి ఘోరమైన కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని ప్రజాప్రతినిధులకు కరువు సమస్య పట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సంక్షేమం గురించి ఆలోచించాల్సిన నాయకులు కేవలం వ్యక్తిగత ఆదాయ వనరులపైనే ధ్యాస పెట్టారని... రైతులు, కూలీలు, కౌలు రైతుల కష్టాలను పట్టించుకోకపోవడం శోచనీయమని ప్రజలు మండిపడుతున్నారు. ?రెవెన్యూ, వ్యవసాయ శాఖలను అప్రమత్తం చేసి కరువు పరిస్థితులను అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు తాగునీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది.

**దయనీయంగా కౌలు రైతుల బతుకులు**

ముందస్తు కౌలు చెల్లించి మరీ పంటలు వేసిన కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పెట్టిన పెట్టుబడులు రాకపోగా, అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో దిక్కు తోచని స్థితిలో వున్నారు. వారిలో కొంత మంది వెల్దుర్తి మండలంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ కాలువ కింద సాగయిన భూముల్లో కూలి పనులకు ఆటోల్లో వెళ్లి వస్తున్నారు. ఎక్కువ మంది కర్నూలుకు అడ్డా కూలీలుగా వెళ్తున్నారు.

**ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలు**


కర్నూలును ?కరువు జిల్లాగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి. ?రైతులు తీసుకున్న పంట రుణాలన్నింటినీ రద్దు చేసి, కొత్తగా పంట రుణాలు అందించాలి. ?రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను ఉచితంగా అందజేయాలి. ?బీమా పరిహారాన్ని అర్హులైన రైతులందరికీ వెంటనే చెల్లించాలి.

**శాశ్వత కరువు నివారణకు ప్రత్యామ్నాయాలు**

తుంగభద్ర, కృష్ణ, హంద్రీ నదుల వంటి జీవనదులు జిల్లాలో ఉన్నప్పటికీ, పాలకుల అశ్రద్ధ కారణంగా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మారుతున్న ప్రభుత్వాలు కేవలం వాగ్దానాలు, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణలో విఫలమవుతున్నాయి. ?వేదవతి రిజర్వాయర్‌ను 8 టిఎంసిలతో పూర్తి చేస్తామని గత ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నాయి. ఆర్డీఎస్ కుడికాలువ, మేలిగనూరు వరద కాలువ, పందికోన రిజర్వాయర్ కుడి-ఎడమల కాలువలు, గుండ్రేవుల రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేయాలి. హంద్రీ-నీవా ద్వారా చెరువులకు, స్లూయిస్‌ల ద్వారా చిన్న కుంటలకు నీరు నింపితే జిల్లాను కరువు బారి నుంచి కాపాడుకోవచ్చు. పాలకులు నిర్లక్ష్యాన్ని వీడాలన్నా, శాశ్వత కరువు నుంచి విముక్తి లభించాలన్నా... రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు రాజకీయాలకు అతీతంగా సంఘటితమై బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సిందే.

**జి. రామకృష్ణ**

# కావలెను!



"ఇంకా, పేరు లేని ( పే.లే ) పార్టీకి అర్జెంటుగా కేడర్, లీడర్లు కావలెను. సభ్యత్వం పూర్తిగా ఉచితం. ఓటర్లు మాత్రమే అర్హులు. పార్టీ కార్యకలాపాలన్నీ సో.మీ లోనే జరుగుతాయి "" సో.మీ ఏంట్రా!"- ఆసక్తిగా వింటున్న నాయుడు, పంటి కింద రాయిలా పడిన ఆ మాటకు చిరాకు పడ్డాడు." సోషల్ మీడియా అనే మాటని అలవాటు చెయ్యడానికి అలా కుదించి పెట్టుకున్నారు ''- పేపర్ చదవడం ఆపి, అభిప్రాయపడ్డాడు పరదేశి." సర్లే.. మిగిలింది చదువ్""ఆ.. జరుగుతాయి. మైనర్లను మా సో.మీకి దూరంగా ఉంచి, వారి భవిష్యత్తులను కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులు లేదా సంరక్షకులదే! లీగల్ లావాదేవీలకు తావు లేదు."

" పార్టీ పేరు ప్రకటించకుండా, ఇదేట్రా ఈ ప్రకటన!''- వినుగ్గా, చుట్ట ముట్టించాడు నాయుడు." ఇంకా, బోలెడు ముస్తాబు ఉన్నట్టుంది విను.. వివరాలు 14వ పేజీలో.. ( పేపర్ తిరగేసి ) ఇంతవరకూ అవకాశానికి నోచుకోలేని కుల, మతాల వారికి ప్రధాని, ముఖ్యమంత్రి పదవులు రిజర్వు చేయడమైనది. జెన్ జీ తరాన్ని దృష్టిలో ఉంచుకుని 70 శాతం పార్టీ టికెట్లు, వారికే కేటాయింపు...ఉద్యమాల జోలికి వెళ్లకుండానే కార్యకలాపాలు... కాబట్టి, హై బి.పి, షుగర్ పేషెంట్లతో పాటు, స్టంటులు, బైపాస్ వారు కూడా ఇసుమంతైనా ఇబ్బంది లేకుండా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వెసులుబాటు"" ఇదేదో బాగుందిరా! ఇంతకీ..టిక్కెటిచ్చి..ఫండిస్తారా...'' అంటూ, కాల్చుతున్న చుట్టను యాష్ ట్రే లో పెట్టి, అడిగాడు నాయుడు." పూర్తిగా సదవనీ.. రాద్ధాంతములు లేని సిద్ధాంతములను అమలుపరచబడును. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను, తీసుకున్న నిర్ణయాలను, ఇచ్చిన జి.ఒ లను, కేటాయింపులను పే.లే. పార్టీ వ్యతిరేకించదు"" ఇదేమి దిక్కుమాలిన పార్టీ రా!.. ఎగిరే పిట్టకు మసాలా నూరడమంటే ఇదే!"- కుర్చీలో చేరబడి, మళ్లీ చుట్ట ముట్టించుకున్నాడు నాయుడు.పరదేశి పేపర్ పక్కన పడేసి, దీర్ఘంగా ఆలోచించడం మొదలెట్టాడు." జె.పి, జె.డి లాంటి వాళ్లే జెండాలు మడతెట్టేసి, జైహింద్ కొట్టేశారు. ఈళ్ల బతుకెంత! ప్రెతీవోడికీ పోలిటిక్సంటే సులకనైపోయింది "- నాయుడికి బాగా చిరాకొచ్చింది.దీర్ఘాలోచన నుంచి బయటపడి--" అలాగనీకన్నా! ఈ ప్రెకటన ఇచ్చినోడు, గట్టి మతలబ్ మేనే అయింటాడు.. గుజరాత్ లో కొన్ని అనామతు ( అనామక )పార్టీల ఎకౌంట్లలోకి భూరి విరాళాలు ఆటంతట అవే వొచ్చేసి, పడిపోనాయట! ఇలాటి జిమ్మిక్కులు తెలిసినోడే, ఇలాటి ప్రెకటన ఇచ్చి వుంటాడని కచ్చితంగా నా నమ్మకం". ఈమధ్య రిజిస్ట్రేషన్, ఎలక్షన్ కమిషన్ గుర్తింపులేని గుజరాత్ లోని కొన్ని పార్టీలకు దాదాపు 1700 కోట్ల రూపాయల విరాళాలు వచ్చినట్టు ఏదో పేపర్ లో చదివిన వార్త పరదేశికి గుర్తొచ్చింది." అద్సరే! నమ్మించడానికైనా కనీసం ఒక జెండా, దానికో రంగూ, గుర్తూ ప్రెకటించాలి గదా!"" వార్త.. పూర్తిగా సదవలేదు.. ఆగు ( పేపర్ అందుకొని ) ఆ..చేశాడన్నో! ఏటంటే.. జెండా పూర్తిగా తెలుపు రంగులో ఉంటుంది. అంచులు మాత్రం కాషాయ రంగులో ఉంటాయి. పార్టీ గుర్తుని ఓటర్ల అభిప్రాయం మేరకు ఎంపిక చేయడం జరుగుతుంది. సరైన గుర్తు సూచించిన వారికి తగిన బహుమతి.. ఒకే దాన్ని ఎక్కువ మంది సూచిస్తే లాటరీ ద్వారా ఒకరి పేరు ఎంపిక చేసి వారు ఊహించని బహుమతి అందజేస్తాము "" నీ అదృష్టమో, ఆళ్ల దురదృష్టమో! నువ్వూ ఒక గుర్తు పంపించెయ్"- నవ్వుతూ, పైకిలేచి పంచె సర్దుకున్నాడు నాయుడు.ఏదో, చీకట్లోకి రాయి విసురుదామన్న సరదాతో, పరదేశి కూడా పైకి లేస్తూ, అడిగాడు. ఇంతలో ఎక్కడి నుంచో, ఒక అరుపు

# వెయ్యిమంది విద్యార్థుల గలంతో హ్యాపీ బర్త్డే మోడీజీ





పామర్రు సెప్టెంబర్ 11 నిర్భయవార్త ప్రతినిధి ప్రతీ విద్యార్థి స్వహస్తాలతో పోస్ట్ కార్డుపై మోడీగారికి శుభాకాంక్షలు తెలిపి పోస్ట్ చేసిన గురుకుల పాఠశాల విద్యార్థులు సెప్టెంబర్ 17 న ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారి జన్మదిన కార్యక్రమం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ గారు ఒక నెలరోజులపాటు వినూత్న కార్యక్రమాల క్యాలెండరు రూపొందించారు. జాతీయ పార్టీ అధ్యక్షులు శ్రీ నితిన్ నబిన్ గారి సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి. వి. ఎన్. మాధవ్ గారి ఆదేశాలమేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకూ "సేవా సంకల్ప అభియాన్ "పేరిట రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవకార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం మేరకు సురేష్ గారు కొన్ని కీలక కార్యక్రమాలు చేపట్టబోరున్నారు. మోడీ గారికి 76 వ సంవత్సరం రాబోతున్న సందర్భంగా 76 వేల పోస్ట్ కార్డులతో మోడీగారికి విద్యార్థి, విద్యార్థునులు చేత శుభాకాంక్షలు తెలపాలని నిర్ణయించి మొదటగా ఈనెల అనగా సెప్టెంబర్ 1 న అమరావతి విట్ క్యాంపస్ లో సుమారు రెండు వేల ఐదు వందల పోస్ట్ కార్డులతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గారు, భాజపా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ గారు, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి గారు, పోస్ట్ మాస్టర్ జనరల్ శివరాం గారు పాల్గొని ప్రారంభించారు. ఆ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా ఈరోజు కృష్ణా జిల్లా పామర్రులో గల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో (బాలురు ) కార్యక్రమం నిర్వహించటం జరిగింది. అక్కడ చదువుతూ హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులచే పోస్ట్ కార్డు పై మోడీ గారి నివాశానికి అడ్రెస్స్ చేస్తూ అందరూ నరేంద్ర మోడీ గారికి 76 వ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ కార్డులు ప్రదర్శన చేసారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఇంచార్జి శ్రీమతి నిర్మలా కిషోర్ గారు, రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ గారు, ప్రధాన కార్యదర్శులు పేరిచర్ల ఉదయ్ కుమార్, బసవరాజు, రాకేష్ చంద్, ఉపాధ్యక్షులు వుల్లూరి గంగాధర్, చాట్రాగడ్డ రాజశేఖర్,సోషల్ మీడియా కన్వీనర్ లావిన్ బాబు జిల్లా మోర్చా అధ్యక్షులు విజయేంద్ర, ఎస్. వి. కోటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ మరియు సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొంతమంది విద్యార్థులు కూడా అక్కడి సమస్యలు మోడీగారిని సభముకంగా మాట్లాడి ఆకట్టుకున్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

### బానోతు ఈరు నాయక్ టి ఎస్ టి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు





భద్రాచలం సెప్టెంబర్ 11 నిర్భయ వార్త ప్రతినిధి ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల వసతి గృహాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పాఠశాలలో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈరు నాయక్ అన్నారు. శుక్రవారం నాడు ఐ టి డి ఏ గిరిజన సంక్షేమ శాఖ డిడి ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం సందర్శించి టీచర్లకు సంబంధించిన సమస్యలు మరియు పాఠశాలల్లో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని వీలైనంత తొందరగా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజును తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంతోపాటు ఏజెన్సీ ప్రాంత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఖుఖీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ,ఉపాధ్యాయులు శోభన్ , మోతిలాల్ ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ ఐటీడీఏ పీవో బి.రాహుల్



భద్రాచలం సెప్టెంబరు 11 నిర్భయ వార్త ప్రతినిధి. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ విద్యాలయాలలో తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బంది గెస్ట్ ఫాకల్టీ నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అభ్యర్థులు దరఖాస్తు సమయంలో సమర్పించిన వివరాలు అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తాత్కాలిక మెరిట్ జాబితాలు ప్రోవిషనల్ మెరిట్ లిస్ట్ సిద్ధం చేయబడినదని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తాత్కాలిక మెరిట్ జాబితాలను పరిశీలించి, తమ పేరు, విద్యార్హతలు, మెరిట్, ాజు/ చీజు ఢ్రాష్ట్ర.ణ లేదా ఇతర సంబంధిత వివరాలలో ఏమైనా అభ్యంతరాలు / తప్పులు ఉన్నట్లయితే, తగిన ఆధారాలతో తమ అభ్యంతరాలను సమర్పించ చెప్పగలరని ఆయన అన్నారు. అభ్యంతరాలను ఈనెల 15వ తేదీన సా 05 గం లోపు మాత్రమే కార్యాలయ పనివేలలో, ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐ టి డి ఎ , భద్రాచలం నందు నేరుగా సమర్పించవలెనని ఆయన అన్నారు. అభ్యంతరాలను సమర్పించే అభ్యర్థులు తమ అభ్యంతరానికి సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా జతపరచవలెనని,నిర్ణీత గడువు అనంతరం అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబడవని ఆయన అన్నారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం, అర్హత సంబంధిత నియామక నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టబడునని ఆయన అన్నారు. ఇతర వివరముల కొరకు చరవాణి నంబర్: 8500136628 కి సంప్రదించండి

## చిన్నముసలేరు గిరిజన ఆదివాసులు సాగు చేసుకునే భూముల జోలికి ఫారెస్ట్ అధికారులు రావద్దు

### న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో డేవిడ్ రాజు కు వినతి పత్రం.




చర్ల సెప్టెంబర్ 11 నిర్భయవార్త ప్రతినిధి. అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 కంటే ముందునుండే చర్ల మండలం చిన్నముసలేరు గిరిజన ఆదివాసులు పోడు సాగుచేసుకొని పత్తి వరి ఇతర పంటలు సాగు చేసుకోని జీవనం కొనసాగిస్తున్నారనీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 సంవత్సరంలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా బెదిరింపులకు పాల్పడి చిన్నముసిలేరు గిరిజన ఆదివాసీలను బెదిరించి ఆదివాసీల పైన అక్రమ కేసులు పెడతాం మీరు ఆ భూమి వదిలేయకుంటే అని చెప్పి భయభ్రాంతులకు గురిచేసి వాళ్లతోనే అక్రమంగా సంతకాలు పెట్టించుకొని ఈరోజు వాళ్ల భూమి 45 ఎకరాలకుట్రెంచ్ లు కొట్టడం జరిగింది మిగతా 35 ఎకరాల భూమిని కూడా సాగు చేయకుండా ఇవాళ ఫారెస్ట్ అధికారులు గత ఆరు నెలల నుండి ట్రెంచ్ లు కొట్టే ప్రయత్నానికి పూనుకుంటా ఉన్నరు. ఇట్లాంటి పద్ధతులు మానుకోవాలని చెప్పి ఫారెస్ట్ అధికారులకు రిప్రెండేషన్లు చేశాం ఐటిడిఏ అధికారులను కలిశాం కలెక్టర్ ను కలిసి కూడా మా బ్రతుకులు బాగుచేసి మా భూమిలో మేము




సాగు చేసుకుంటాము అని వారు అన్నారు ఇన్ని సంవత్సరాలు రాని ఫారెస్ట్ అధికారులు ఈ సంవత్సరం వచ్చి ఆ భూములకు దిగొద్దు మీ పైన కేసులు పెడతాం మిమ్మల్ని జైలుకు పంపుతామని చెప్పి బెదిరింపులకు పాల్పడతా ఉన్నారు. భూమిని నమ్ముకొని భూమిని సాగు చేసుకుని బ్రతుకుతున్న ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేయకూడదని వారు ఏమి వందల వేల ఎకరాలు కొట్టుకోవడం లేదని మనిషికి ఎకరం మాత్రమే సాగు చేసుకుంటున్నారని దీనిని ఫారెస్ట్ అధికారులు ఉన్నతాధికారులు గమనించాలని కోరుతా ఉన్నాం. ఇట్టి విషయంపై శుక్రవారం ఐటీడీఏ భద్రాచలం ఏపీవో డేవిడ్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోడి జానకక్క తుర్ర వెంకటమ్మక్క సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ దుమ్ముగూడెం మండల కార్యదర్శి కుంగారావు ఏఐటిఎఫ్ ఆల్ ఇండియా ట్రైబల్ ఫారం జిల్లా నాయకులు మట్ట నరసింహారావు సరళ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సంతపూర్ సురేష్ మండల నాయకులు తుర్రం సత్తిబాబు ఉండి కృష్ణారావు సోడి వెంకటేష్ గుర్రం సీతమ్మ సాయిల అర్జమ్మ సోడి రత్తమ్మ సోడి దుర్గా కల్లూరు సరోజిన శ్యామల రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మండల కోఆప్షన్ సభ్యులు హనీఫ్



కారేపల్లి సెప్టెంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్ వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా, కొనిజర్ల, సింగరేణి, వైరా మున్సిపాలిటీ, ఏన్కూర్, ముస్లిం, మైనార్టీల మసీదుల ప్రహరీ గోడల నిర్మాణాలు, కబురస్థాన్ల ప్రహరీ గోడల నిర్మాణాల కోసం సుమారు 10 కోట్లు కేటాయించాలని సింగరేణి మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు హనీఫ్ శుక్రవారం వైరా ఎమ్మెల్యే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి మాలోత్ రాందాస్ నాయక్ ను హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం పట్ల వైరా నియోజకవర్గ పరిధిలోని ముస్లిం, మైనార్టీ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

# పౌష్టికాహారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

**గర్భిణులు, చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**
**తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్**









మేడ్చల్ మల్కాజ్గిరి సెప్టెంబర్ 11 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: గర్భిణులు, చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోందని, ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతితో కలిసి చైర్మన్ గోలి శ్రీనివాస్ శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో కీసర ఆర్డీఓ వెంకట్ రెడ్డి వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

**చౌక ధరల దుకాణాల పరిశీలన**

ముందుగా మేడ్చల్‌లోని చౌక ధరల దుకాణాలను కమిషన్ బృందం పరిశీలించింది. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. దుకాణాల వద్ద ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని, జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల తహసీల్దార్ల ఫోన్ నంబర్లను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని చైర్మన్ సూచించారు. ప్రజలకు సన్నబియ్యం సక్రమంగా అందుతున్నాయా, డీలర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యం అందిస్తున్నారా అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

**పాఠశాలలో ఆహార నాణ్యతపై ఆరా**

అనంతరం కిష్టాపూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన కమిషన్ బృందం డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించింది. సరుకుల ఎక్స్‌పైరీ తేదీలను తప్పనిసరిగా పరిశీలించిన తర్వాతే వినియోగించాలని, నాణ్యమైన సన్నబియ్యంతోనే విద్యార్థులకు భోజనం వండాలని సూచించారు. పాఠశాలలో ఉడికించిన గుడ్లను పరిశీలించగా వాటి రంగులో మార్పు కనిపించడంతో కారణాలను అడిగి తెలుసుకున్నారు. గుడ్ల నమూనాలను సేకరించి ఫుడ్ సేఫ్టీ అధికారులు పరీక్షలు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల రిజిస్టర్లను పరిశీలించిన చైర్మన్.. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన పౌష్టికాహారం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకుని సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆయన.. పాఠశాలలో మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే ధైర్యంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**భోజనం సరిగా లేదన్న విద్యార్థులు**

దమ్మాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కమిషన్ సభ్యులు విద్యార్థుల్లో అధిక సంఖ్యలో లంచ్ బాక్సులు ఉండటాన్ని గమనించారు. ఇంటి నుంచి భోజనం ఎందుకు తెచ్చుకుంటున్నారని విద్యార్థులను అడగగా.. పాఠశాలలో భోజనం సరిగా ఉండటం లేదని వారు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంలో లోపాలు ఉంటే ఉపేక్షించబోమని చైర్మన్ హెచ్చరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో భోజన నాణ్యతను తాము మరోసారి వచ్చి పరిశీలిస్తామని తెలిపారు.

**గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం హక్కు**

అనంతరం దమ్మాయిగూడ అంబేద్కర్ నగర్, జవహర్ నగర్ మల్కాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను చైర్మన్, సభ్యులు సందర్శించారు. కేంద్రాల్లో ఉన్న చిన్నారుల సంఖ్య, హాజరవుతున్న గర్భిణుల వివరాలను తెలుసుకున్నారు. వారికి సరిపడా పౌష్టికాహారం, గుడ్లు, పాలు అందుతున్నాయా అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజన మెనూను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. గర్భిణులు, 14 సంవత్సరాల లోపు చిన్నారులకు పౌష్టికాహారం పొందడం చట్టబద్ధమైన హక్కు అని, ఆ హక్కు వారికి సక్రమంగా అందేలా చూడటం కమిషన్ బాధ్యత అని గోలి శ్రీనివాస్ తెలిపారు. హక్కుదారులకు ఎలాంటి నష్టం కలగకుండా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా కమిషన్ ఎల్లప్పుడూ
అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ కమిషన్ సభ్యులు తమ ఫోన్ నంబర్లను గర్భిణులకు అందజేశారు. ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్ కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా వినాయక ప్రతిమలు...




భద్రాచలం 11 సెప్టెంబరు నిర్భయ వార్త ప్రతినిధి. రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భద్రాచలం పట్టణ ప్రజలకు మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను ఉచితముగా పంపిణీ చేయడానికి విద్యార్థిని విద్యార్థులచే మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయడం జరిగిందని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ అన్నారు. శుక్రవారం నాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వినాయక చవితిని పురస్కరించుకొని ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్ కల్చరల్ విభాగం సంయుక్తంగా కళాశాలలోని విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందితో కలిసి వినాయక మట్టి బొమ్మలను తయారు చేయడం జరిగిందని ఆయన అన్నారు. మట్టి వినాయకుని వాడటం వల్ల నీటి కాలుష్యం అనేది ఏర్పడదని ప్రిన్సిపాల్ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. తయారుచేసిన వినాయక మట్టి బొమ్మలను భద్రాచలంలోని ప్రజలకు వినాయక చవితి పండుగ ఉచితముగా విద్యార్థిని విద్యార్థులు పంపిణీ చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కపిల భారతి, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ బి సుధాకర్ రావు, ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సెస్ బకాయిల చెల్లింపులకు ప్రత్యేక కార్యాచరణ


**పబ్లిక్ రీడింగ్ రూమ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్**




మేడ్చల్ మల్కాజ్గిరి సెప్టెంబర్ 11 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:మేడ్చల్ జిల్లా పరిధిలో గ్రంథాలయ సెస్‌ను సక్రమంగా వసూలు చేసి, పెండింగ్ బకాయిలను సకాలంలో చెల్లించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజన్ అహ్మద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రంథాలయ సెస్ వసూళ్లు, బకాయిల చెల్లింపులు, గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణపై శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేరం సురేష్ బాబు పాల్గొన్నారు. వివిధ మున్సిపాలిటీల వద్ద ఉన్న గ్రంథా లయ సెస్ బకాయిలను ప్రాధాన్యతతో చెల్లించాలని, ప్రతి నెల రూ.2 లక్షల చొప్పున చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంస్థల వారీగా బకాయిల వివరాలను సేకరించి, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వసూళ్లను పూర్తి చేయాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గతంలో నెలకు సుమారు రూ.5 లక్షల చొప్పున గ్రంథాలయ సెస్ అందేదని, ఏప్రిల్ 2026 నుంచి ఆ మొత్తం అందడం లేదని సమావేశంలో చర్చించారు. పెండింగ్ మొత్తాన్ని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు లేఖలు రాసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.4 కోట్ల సెస్ వసూలు లక్ష్యంగా నిర్ణయించగా, ఏప్రిల్ నుంచి ఆగస్టు 2026 వరకు వివిధ స్థానిక సంస్థల నుంచి రూ.5 కోట్లకు పైగా వసూలు కావడంపై సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. మిగిలిన కాలంలోనూ వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాన్ని మించి ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్న గ్రంథాలయ పన్ను, సెస్ వివరాలను సేకరించేందుకు ఈ-సేవా అధికారులకు లేఖలు పంపేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేరం సురేష్ బాబును కోరారు. విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడేలా మున్సిపాలిటీల పరిధిలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అక్కడ వార్తాపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలని తెలిపారు. గ్రంథాలయ సెస్ ద్వారా వచ్చే ఆదాయం గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు, విద్యార్థులు మరియు యువతకు అవసరమైన అధ్యయన వసతుల కల్పనకు ఉపయోగపడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సెస్ వసూళు ,, బకాయిల చెల్లింపుల పురోగతిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. స్థానిక సంస్థలు జిల్లా గ్రంథాలయ సంస్థతో సమన్వయంతో పనిచేసి గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ కోరారు.

# సుభాష్ నగర్ వాసుల 'ఆశాజ్యోతి' ఎయిడెడ్ స్కూల్....

## సర్పంచ్ పూనెం కృష్ణ ఎంఈఓ బెక్కంటి శ్రీనివాస్ రావు





భద్రాచలం సెప్టెంబర్ 11 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం సుభాష్ నగర్ కాలనీలో పనిచేస్తున్న గోపాలకృష్ణ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల స్కూల్ గ్రామస్తుల ఆశాజ్యోతి గా నిలుస్తుందని భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం.కృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. బలహీన బడుగు వర్గాలకు అభ్యున్నతి కోసం మూడు దశాబ్దాల కాలము నుండి అంకితభావంతో సుభాష్ నగర్ లో ఈ పాఠశాల పేద విద్యార్థులకు ఆశాదీపంగా పనిచేస్తుందని వార్డు నెంబర్ గోపి తెలిపారు. ఈ పాఠశాలల 1995 ఒక చిన్న గుడిసెలో ప్రారంభమైన ఈ పాఠశాల 2022 లో జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని జిల్లా కలెక్టర్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది అనంతరం 2023 సంవత్సరము లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయగా అవార్డు స్వీకరించటం ఆమె కృషికి నిదర్శనమని వార్డు మెంబర్ గోపి హర్షధ్వనాల మధ్య ప్రధానోపాధ్యాయుని కృషిని అభినందించారు.ప్రస్తుతం ఈ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వేంపాటి ఉషారాణి చెప్పటంతో అక్కడ ఉన్న ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో ఆనందం వ్యక్తం చేశారు.1996 గోదావరి వరదల్లో పాఠశాల మొత్తం శిధిలావస్థకు చేరి కింద పడిపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఆ కాలనీవాసులు నానాజీ వారిని ఒప్పించి మెప్పించి తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మించి 2020 అదే షెడ్లో పాఠశాలను నిర్వహించారు. అనంతరం పలుమార్లు వరదల్లో రేకుల షెడ్డు కూడా ప్రమాదంగా మారటంతో ఎప్పుడు షెడ్డుపడి విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందో అని ముందస్తు జాగ్రత్తతో ప్రధానోపాధ్యాయిని ఐటిసి పేపర్ బోర్డ్ సారపాక వారి సహాయం కోసం పలుమార్లు అభ్యర్థన చేయటంతో కంపెనీ ప్రతినిధులు సర్వే నిర్వహించి పాఠశాల అవసరాన్ని గుర్తించి 2022 కరస్పాండెంట్, ప్రధాన ఉపాధ్యాయుని సమన్వయంతో పాఠశాల భవన నిర్మాణానికి 20% ఆర్థిక సహాయాన్ని ఐ టి సి కంపెనీకి అందించి నూతన పక్క భవనాన్ని నిర్మించి పాఠశాల ప్రాంగణం చుట్టూ ప్రహరి గోడ నిర్మాణంతో జిల్లాలోనే ఒక మోడల్ స్కూల్ మైమరిపించే విధంగా పాఠశాల పనిచేస్తున్నట్లు గ్రామస్తులు నూకా రత్నం తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠశాల పక్కా భవనం పిల్లలందరికీ పక్కా రన్నింగ్ వాటర్ తో కూడిన మరుగుదొడ్లు,వాష్ బేసిన్ అన్ని రకాల వసతులు ఈ పాఠశాల సొంతం అని వారు అభిప్రాయం తెలియజేశారు. గ్రీన్ భద్రాద్రి వారి సహాయ సహకారాలతో పాఠశాల ప్రాంగణం మొత్తం పెద్దపెద్ద వృక్షాలతో పచ్చని వాతావరణానికి ఈ పాఠశాల కేరాఫ్ అడ్రస్ గా మారింది అని చెప్పక తప్పదు. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలలో ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్,గణితం అంశాలలో కనీస అభ్యసనా సామర్థ్యాలు సాధించి మౌఖికంగా ఏ లెక్కల అడిగినా టక టక చెప్పి అందర్నీ అబ్బురపరచటం గమనార్హం అని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాస్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ చేతులమీదుగా విద్యార్థులందరికీ నూతన ఏకరూప దుస్తులు అందించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు అందరి సమక్షంలో ప్రధానోపాధ్యాయని, మండల విద్యాశాఖ అధికారి పాఠశాలకు విచ్చేసిన గ్రామ సర్పంచ్ పూనెం. కృష్ణను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూనెం.కృష్ణ, వార్డు నెంబర్ కావూరి.గోపి,మండల ఏపిఎం, టైలర్ దాసు, పాఠశాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపికృష్ణ, ఎండిఎం నిర్వాహకురాలు నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే టూరిజం సర్క్యూట్ లో తాలిపేరు ప్రాజెక్టునుచేర్చాలి

## ఆదివాసి యువతకు ఉపాధి అవకాశాలు రావాలి




చర్ల అక్టోబర్ 11 నిర్భయ వార్త ప్రతినిధి. శుక్రవారం గొండ్వాన సంక్షేమ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.మండల అధ్యక్షులు ఇర్ప అంజి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బీరబోయిన శేఖర్ మాట్లాడుతూ హైదరాబాదు నుండి వాజేడు మండలం బొగత వరకు ఏర్పాటు చేయబోయే టూరిజం హబ్ లో కిన్నెరసాని,బొగత జలపాతం, పులిగుండాల తో పాటుగా ప్రకృతి అందాలకు నిలయమైన తాలిపేరు ప్రాజెక్టు పేరు లేకపోవడం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటకాన్ని వెనుకబాటు చేయడమే అని అన్నారు. సుదూరమైన చత్తీస్గఢ్ అడవుల్లో నుంచి వస్తున్న తాలిపేరు ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. చత్తీస్గఢ్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్నటువంటి తాలి పేరు ప్రాజెక్టును సందర్శిక ప్రాంతంగా తీర్చిదిద్దినట్లయితే మూడు రాష్ట్రాల నుంచి పర్యాటకులు అత్యధికంగా వస్తారు. తాలి పేరు ప్రాజెక్టు దగ్గర బోటింగ్, ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలి అన్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా తాలి పేరు చుట్టూ దట్టమైనఅడవులు ఉండటం వల్ల ఎన్నో రకాల వనమూలికలు ఉంటాయి. కాబట్టి తాలిపేరు దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల్లో వనమూలికల ప్లాంటేషన్ కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. దీని ద్వారా ఆయుర్వేద విద్యను అభ్యసించే వాళ్లకు ఈ ప్రాంతం సందర్శనకు ప్రాంతంగా మారుతుందని అన్నారు. కాబట్టి ఐటిడిఏ పిఓ, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఈ టూరిజం హబ్ లో తాలిపేరు ప్రాజెక్టు పేరును చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కారం పద్మ, తెల్లశీ సునీత, తులసి తదితరులు పాల్గొన్నారు

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ అరుణ్ కుమార్

## చర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన భద్రాచలం డీఎస్పీ



చర్ల సెప్టెంబర్ 11 నిర్భయవార్త ప్రతినిధి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ శుక్రవారం నాడు చర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను పిలిపించి వారి ప్రవర్తన, ప్రస్తుత కార్యకలాపాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రౌడీ షీటర్లు ఇకపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో జీవించాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవనం సాగించాలని, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు.రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎస్పీ పోలీసు సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, చర్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## పౌష్టికాహారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
## తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్






మేడ్చల్ మల్కాజ్గిరి సెప్టెంబర్ 11 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:జాతీయ ఆహార భద్రత చట్టం--2013ను పకడ్బందీగా అమలు చేసి, గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ సూచించారు. ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహించి ప్రజల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టం అమలు తీరుపై శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యుడు ఓరగంటి ఆనంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జాతీయ ఆహార భద్రత చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి అమలు చేస్తోందన్నారు. పౌష్టికాహారం పొందడం లబ్ధిదారుల హక్కు అని, ఆ హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జిల్లాలోని రేషన్ దుకాణాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో కొన్ని లోపాలు, సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, 14 సంవత్సరాల లోపు చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారంలో నిర్లక్ష్యం కనిపించిన అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన బాలామృతం, పౌష్టికాహారం తదితరాలను నాణ్యతతో అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. కిషోర బాలికల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉన్నందున వారికి పౌష్టికాహారంతో పాటు పాలు, పండ్లు అందించి రక్తహీనతను తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుడ్ల సరఫరాలో నాణ్యత లోపాలు తలెత్తకుండా సంబంధిత కాంట్రాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు.దమ్మాయిగూడ పాఠశాలలో పరిశుభ్రత లోపించడం, సరైన రికార్డులు, హాజరు పట్టికలు నిర్వహించకపోవడం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. బాధ్యులైన హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు పాఠశాలలు, రెసిడెన్షియల్ సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని ప్రతి నెలా తనిఖీ చేయాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని, అన్ని వివరాలతో రికార్డులు పక్కాగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.ఎన్నికలు, సర్వేలు వంటి అదనపు విధులకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను కేటాయించే సందర్భంలో వారి స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలకు భోజనం అందించే బాధ్యత ప్రతి ఒక్కరికీ లభించదని, మానవతా దృక్పథంతో ఈ అవకాశాన్ని బాధ్యతగా భావించి విధులు నిర్వర్తించాలని చైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్ కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారదతో పాటు ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాస్టర్లు, కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబానికి అందిన పరిహారం

## - చెక్ అందించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్




కారేపల్లి సెప్టెంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. అడవి జంతువులకు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల కు తగిలి మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ కుటుంబానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక , సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లు రూ. 30 లక్షల చెక్కును పంపిణీ చేశారు. శుక్రవారం అటవీ శాఖ అమరుల దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, అటవీ శాఖ రాష్ట్ర అధికారులు చేతుల మీదుగా ఎఫ్ బీ ఓ నవీన్ సతీమణి ప్రమీలకు చెక్కును అందజేశారు. కారేపల్లి మండలం వెంకట్యాతండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్- సర్పంచ్ బానోత్ బూలీ కుమారుడైన బానోతు నవీన్ ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , బూర్గంపాడు మండలం లో విధులు నిర్వహిస్తుండగా, , వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన సంగతి విదితమే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా కుటుంబానికి అన్ని విధాల సహకారం అందుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంగళం కంపెనీ జనరల్ మేనేజర్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, అడపా పుల్లారావు,సుధాకర్ తదితరులు ఉన్నారు.

# సుబ్బయ్యగుంట చెరువు రక్షిస్తారా..

## కలెక్టర్ స్పందిస్తే పరిరక్షణ దక్కుతుంది




కారేపల్లి సెప్టెంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూమి పరిరక్షణ విషయంలో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణలపై నోటీసులు జారీ చేశామని చెబుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో చెరువు హద్దులను మాత్రం ఇప్పటికీ స్పష్టంగా ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇవ్వడం తప్ప ఆక్రమణలను అడ్డుకునే చర్యలు ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై శుక్రవారం ఎమ్మార్వోను సంప్రదించగా.. సర్వేయర్ అందుబాటులో లేరని, విషయం తమ దృష్టిలో ఉందని తెలిపారు. మరోవైపు ఇరిగేషన్ శాఖ అధికారిని సంప్రదించగా.. హద్దుల ఏర్పాటు కోసం ఎమ్మార్వోల దృష్టికి తీసుకెళ్లామని, అయినా హద్దులు ఏర్పాటు చేయడం లేదని పేర్కొన్నట్లు సమాచారం. దీంతో చెరువు శిఖం హద్దులు నిర్ణయించే విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయం కొరవడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చెరువులే రైతులకు ఆధారం..**

వర్షాభావ పరిస్థితులు, ఎండల ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్న వేళ చెరువుల ప్రాధాన్యత మరింత పెరిగింది. జిల్లాలోని చెరువుల కింద సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసిన పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో చెరువుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు.. చెరువు శిఖం భూముల విషయంలో మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**తూములపై కఠినంగా.. శిఖం ఆక్రమణలపై ఎందుకు మౌనం?**

చెరువుల్లో అనుమతి లేకుండా తూములు ఇవ్వడం, నీటిని వినియోగించడంపై చర్యలు తప్పవని ఇరిగేషన్ అధికారులు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. మరి అదే చెరువు పరిధిలో శిఖం భూమి ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు వస్తున్నప్పుడు త్వరితగతిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. రైతుల సాగుకు కీలకమైన చెరువులను కాపాడటంలో అధికారులు ఒకే విధమైన కఠిన వైఖరి అవలంబించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**కలెక్టర్ స్పందించాలి**

సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూమి హద్దులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి అధికారికంగా నిర్ధారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆక్రమణలు ఉన్నాయా? ఉంటే ఎవరి ఆధీనంలో ఉన్నాయి? గతంలో జారీ చేసిన నోటీసులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? హద్దురాళ్లు ఎందుకు ఏర్పాటు చేయలేదు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో చెరువు భూమి అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సంయుక్త సర్వే చేయించి చెరువు హద్దులను గుర్తించి, ఆక్రమణలు ఉంటే తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# చర్ల మండలంలోని ఆదివాసి వలస గ్రామమైన కందిపాడు గ్రామం లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్....

**కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ వలస గ్రామాల సంక్షేమానికి పోలీసు శాఖ కృషి. భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్.**





చర్ల సెప్టెంబర్ 11 నిర్భయ వార్త ప్రతినిధి. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఈరోజు చర్ల మండలంలోని ఆదివాసీ వలస గ్రామమైన కందిపాడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి గ్రామంలోని సమస్యలు, ప్రజల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారీకి పాల్పడవద్దని సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాలు మరియు వినియోగం వల్ల కుటుంబాలపై, ముఖ్యంగా యువతపై పడే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. అక్రమ గుడుంబా తయారీ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామంలోని యువత, పిల్లలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తూ గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ మరియు చర్ల ఇన్స్పెక్టర్ రాజు వర్మ స్థానిక విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం, మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందనే భరోసా కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీఐ రాజు వర్మ,ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# రణభేరి ఇక సమరమే సెప్టెంబర్ 13వ తేదీ గుంటూరులో జరుగు సదస్సును జయప్రదం చేయండి

**రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి.**




అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి : శుక్రవారం వినుకొండ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు కాంట్రాక్ట్ మరియు ఉద్యోగులు హాస్పిటల్ ప్రాంగణంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రణభేరి సదస్సు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించడం జరిగినది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ వైద్య మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఉద్యోగ భద్రత చనిపోయిన కుటుంబాలకు ఎక్స్గ్రేషియా మరియు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అనే డిమాండ్లతో ఈనెల 13వ తేదీ గుంటూరులో గుర్రం జాషువా కళా ప్రాంగణంలో రణభేరి సదస్సు జరుగుతుందని ఈ సదస్సుకు ఉమ్మడి గుంటూరు కృష్ణ ప్రకాశం జిల్లాల కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని అదే విధంగా ప్రభుత్వం ఉద్యోగులకు డా,పిఆర్సి వేస్తామని,, ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలకు హామీ ఇవ్వడం జరిగినది వారికి ధన్యవాదములు వారితో పాటు సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎటువంటి హామీ ఇవ్వకుండా ఉండకుండా చాలా బాధాకర విషయమని తక్షణమే ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈ లోపు వారికి మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు 19 సంవత్సరాల నుండి పనిచేస్తున్న 15 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని గవర్నమెంట్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని వారికి కూడా ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులర్ చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన విధంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పెరిగిన రేట్లు అనుగుణంగా సీనియార్టీ ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేసి కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వివిధ పథకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత సంక్షేమ పథకాలు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల పెంచాలని వారి జీవితాల్లో కూడా సంతోషకరమైన వార్తను చెప్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఫార్మసిస్ట్ జ్యోతి ల్యాబ్ టెక్నీషియన్ బాబు ఎక్స్రే టెక్నీషియన్ సాంబశివరావు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తెరపిస్టు బాలకృష్ణ స్టాఫ్ నర్స్ సోమమ్మ సుధారాణి పారామెడికల్ ఉద్యోగులు రమ్య ఎల్లమ్మ సుబ్బు ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ రోజా టివి డిపార్ట్మెంట్ నాయకులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని కరువు నియోజకవర్గంగా ప్రకటించాలి.

**ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.**



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి :.ఏపీ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ల పిలుపుమేరకు శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయం నందు ఈరోజు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు మాట్లాడుతూ , నాటి కాలంలో, దాత కరువు, ధూప కరువు, వలస కరువు, ముష్టి కరువు, 66 కరువులను చూసిన రాయలసీమ, నేడు రాయలసీమ లో పుట్టి పెరిగి పరిపాలన చేసిన నీలం సంజీవరెడ్డి మొదలు నేటి ముఖ్యమంత్రి వరకు రాయలసీమను వాటాలు వేసి పంచుకుతిన్నారే తప్ప రాయలసీమను రతనాల సీమగా చేయాల్సిన బాధ్యతను మరిచి బతుకును బస్టాండ్ పాలు చేస్తున్న తీరు మారాలని రాష్ట్రంలో వర్షాభావం లేక పోవడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని శ్రీకాళహస్తి నియోజకవర్గాలో అన్ని ఓనర్లు పుష్కలంగా ఉన్న ఏర్పేడు రేణిగుంట శ్రీకాళహస్తి రూరల్ మండలాలు వాన కోసం రైతులు పడుతున్న బాధలను గుర్తించి,కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు ఎన్నికల హామీల భాగంగా కేసీ కెనాలను పూర్తి చేయడం వల్ల పడమటి ప్రాంతాలకు నీరు వస్తుందని రైతులకు మేలు జరుగుతుందని ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి కేసీ కెనాల్ ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నియోజకవర్గంలో త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసి రాజన్ ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షులు చారులత సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య రేణిగుంట మండల కార్యదర్శి వైఎస్ మణి రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, తొట్టంబేడు మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ముని చందు, మరియు రైతులు మనీ, రాజయ్య, మల్లయ్య, మహిళా సంఘం నాయకులు భవాని, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ఆదివాసీ హక్కుల పరిరక్షణే లక్ష్యం.

**1/70 చట్టం పరిరక్షణ, GO No.3 సాధనకు ఐక్య ఉద్యమం.**

పాడేరు, అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి ;.ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో పాడేరు పట్టణంలోని మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అల్లూరి జిల్లా కమిటీతో పాటు మండల కమిటీల ఏర్పాటు, ఆదివాసీల హక్కులకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని పరిరక్షించడం, జీవో నెం .3 సాధన, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఆదివాసీల భూమి, హక్కులు, చట్టపరమైన రక్షణను కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. 1/70 చట్టం అమలు, జీవో నెం 3 సాధన కోసం ప్రజలను చైతన్యపరిచి, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, రాజ్యాంగ హక్కుల సాధనే సంకల్పంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.సమావేశంలో రాష్ట్ర సమితి అధ్యక్షులు సోనాయి అప్పలరాజు, ఓంద్రు రామూర్తి, కొక్కుల రామారావు, సిద్దెరి రామూర్తి, ఒలేసి రామలింగం, చెండా కేశవరావు, పాచిపెంట శాంతికుమారి, కాంగు చిన్ని, లకే చిట్టిబాబు, భాస్కరరావు, కూడ సుబ్రహ్మణ్యం, ముత్యం ప్రసాద్, సోనాయి గంగరాజు, సమరెడ్డి నాగబ్బాయి, శెట్టి లక్ష్మన్, మార్క్ రాజ్, కొత్తయ్య, పోతురాజు బాలయ్య, జవ్వాది రామకృష్ణ, సోనాయి యువరాజు, బాకూరు సింహాచలం, కళ్యాణ్ చక్రవర్తి, మనోజ్, కాగి వెంకాయమ్మ, ప్రసాద్, పాంగి చిన్నారాంనాయుడు, వి. సలీం, కిముడు రామారావు, తిరుపతిరావు, లకే భాస్కర్‌రావు, కరుణాకర్, రత్నబాయ, ఉల్లి అర్జున్, భాను సి.హెచ్.రావు, ముదువా రాంబాబు, సత్యనారాయణతో పాటు జిల్లా, మండల నాయకులు, ఆదివాసీ హక్కుల పరిరక్షణ కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## దామిశెట్టి శాంతమ్మ కుటుంబానికి ప్రముఖుల పరామర్శ.



నెల్లూరు జిల్లా, కావలి, నిర్భయవార్త ప్రతినిధి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దామిశెట్టి సుధీర్ నాయుడు తల్లి, మాజీ మండల అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ దామిశెట్టి శాంతమ్మ మృతి పట్ల వైయస్సార్సీపీ ప్రముఖులు వారి కుటుంబాన్ని పరామర్శించారు.కావలి పట్టణంలోని దామిశెట్టి వారి నివాసానికి విచ్చేసిన వైయస్సార్సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మరియు ఎమ్మెల్సీ, నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగా రెడ్డి దామిశెట్టి శాంతమ్మ చిత్రపటాన్ని సందర్శించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్వర్గీయ దామిశెట్టి శ్రీనివాస నాయుడు (చైర్మన్, దామిశెట్టి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ – ఐదీూ ఇంజనీరింగ్ కాలేజ్) మరియు శాంతమ్మ సమాజానికి, పార్టీకి అందించిన సేవలను నాయకులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వే అధికారులతో కలిసి రైల్వే బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి.



నెల్లూరు జిల్లా, కావలి, నిర్భయవార్త ప్రతినిధి :కావలి పట్టణ ప్రజల సుదీర్ఘకాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి అడుగులు వేస్తున్నారు. శుక్రవారం నాడు బుడంగుంట రైల్వే గేటు వద్ద సముచిత మార్గాన్ని అన్వేషించేందుకు రైల్వే డిఈ తదితర అధికారులతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.?కచ్చేరిమిట్ట, ఫైర్ ఆఫీస్ రోడ్డులోని రైల్వే బ్రిడ్జ్ ని నిర్మించి ప్రజలకు రాకపోకల ఇబ్బందులు లేకుండా చేయాలనే బలమైన సంకల్పంతో ఎమ్మెల్యే పనిచేస్తున్నారు.?ఈ పరిశీలన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుందన్నారు. పనులకు ఉన్న సాంకేతిక అడ్డంకులను వేగంగా తొలగించి,బ్రిడ్జిని త్వరగా ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రైల్వే అధికారులు కూడా సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కావలి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఆత్మీయ సమావేశం విజయవంతం.

**ముఖ్య అతిథులు:జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కాకణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఆప్కాప్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు.**

నెల్లూరు జిల్లా, కావలి, నిర్భయవార్త ప్రతినిధి :కావలి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచేందుకు మరియు సమన్వయాన్ని పెంపొందించేందుకు ప్రతిష్టాత్మకంగా 'ఆత్మీయ సమావేశం' నిర్వహించడం జరిగింది.కావలి మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కాకణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఆప్కాప్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే వైఎస్సార్సీపీకి అసలైన బలామని కొనియాడారు. కష్టకాలంలోనూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ ఆత్మీయ సమావేశంలో కావలి నియోజకవర్గంలోని పలు మండలాల వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




# ప్రజా సమస్యే మా బాధ్యత..

**పరిష్కారమే మా లక్ష్యం!**
**34 అర్జీలు.. ప్రతి వినతిపై ఎమ్మెల్యే తక్షణ స్పందన.**
**పేదరికం నుంచి ప్రతి కుటుంబాన్ని బయటకు తీసుకురావడమే P4 లక్ష్యం.**
**గ్రామాల అభివృద్ధితోనే స్వర్ణాంధ్ర సాధ్యం.**
**ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్.**



భీమవరం, వత్సవాయి, నిర్భయ వార్త ప్రతినిధి.ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రజలే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని.. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్పష్టం చేశారు .వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భీమవరం, పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వ్యక్తిగత, కుటుంబ, గ్రామీణ, ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మొత్తం 34 అర్జీలను స్వీకరించారు.అర్జీ ఒక కాగితం కాదు.. ఒక కుటుంబం ఆశప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్వయంగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం ఆశ, ఒక రైతు అవసరం, ఒక పేదవాడి సమస్య ఉండవచ్చని.. అందువల్ల ప్రజల వినతులను నిర్లక్ష్యం చేయకుండా నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అధికారుల వివరాల ప్రకారం హౌస్‌సైట్లకు సంబంధించి 12 అర్జీలు అత్యధికంగా వచ్చాయి. రెవెన్యూ--3, పెన్షన్స్--3, పంచాయతీరాజ్--5, ఆర్‌డబ్ల్యూఎస్--3, ఇతర శాఖలకు --8 అర్జీలు అందాయి.ప్రజలు కార్యాలయాల చుట్టూ కాదు.. పరిష్కారం ప్రజల వద్దకేప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వ్యవస్థ పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. అర్హులైనప్పటికీ పథకాల ప్రయోజనం అందని కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ సేవలను చేరువ చేయాలని ఆదేశించారుP4.. పేదరికంపై ప్రభుత్వ పోరాటంరాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నP4 --పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్ట్‌నర్‌షిప్ కార్యక్రమం ప్రతి పేద కుటుంబ జీవితంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు."పేదరికాన్ని కేవలం ఆర్థిక సహాయంతో తొలగించలేం.. కుటుంబానికి స్థిరమైన ఆదాయం, ఉపాధి, నైపుణ్యం, అవకాశాలు కల్పించినప్పుడే పేదరికం నుంచి శాశ్వత విముక్తి సాధ్యమవుతుంది" అనే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.గ్రామస్థాయిలో అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి సంక్షేమంతో పాటు ఉపాధి, ఆదాయ వృద్ధి అవకాశాలను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు.స్వర్ణాంధ్రకు పునాది గ్రామాల అభివృద్ధేస్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాల సాధనకు గ్రామాల సమగ్ర అభివృద్ధి అత్యంత కీలకమని శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, గృహ వసతి, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడితేనే గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు.అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని.. ప్రతి కుటుంబానికి మెరుగైన జీవితం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి రైతుకు భరోసా, ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాంప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చేలా ఇటువంటి వేదికలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని శ్రీరాం రాజగోపాల్ తెలిపారు."ప్రజలు మాపై ఉంచిన నమ్మకమే మా బలం. వారి సమస్యను వినడం మా బాధ్యత.. పరిష్కారం చూపడం మా కర్తవ్యం. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగే వరకు నిరంతరం కృషి చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.ప్రజల సమస్యల పరిష్కారానికి.. ప్రజల భాగస్వామ్యం కూడా అవసరంప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, తమకు అర్హత ఉన్న పథకాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం మరింత వేగంగా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రాజస్వాశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, భీమవరం మరియు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కావలి పోలీసు సబ్‌డివిజన్ క్రైమ్ మీటింగ్.

**పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి.**
**వినాయక చవితి వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు.**



నెల్లూరు జిల్లా, కావలి, నిర్భయవార్త ప్రతినిధి :కావలి పట్టణంలోని రైల్వే రోడ్డులో గల పోలీసు కమాండెంట్ భవనంలో కావలి పోలీసు సబ్‌డివిజన్ స్థాయి క్రైమ్ మీటింగ్ శుక్రవారం నిర్వహించారు. కావలి డీఎస్పీ రమణకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సబ్‌డివిజన్ పరిధిలోని ఆరుగురు సీఐలు, 14 మంది ఎస్సైలు హాజరయ్యారు.పెండింగ్ కేసులపై సమీక్షఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నమోదైన పెండింగ్ కేసుల పురోగతి, చోరీ కేసుల్లో రికవరీలు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను డీఎస్పీ రమణకుమార్ సర్కిల్ వారీగా సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు.దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎస్పీ ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచడంతో పాటు, ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.వినాయక చవితికి పటిష్ట బందోబస్తు వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డీఎస్పీ రమణకుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. పండుగ కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

## పేదల ఆకలి తీర్చిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి ఐ జాఫర్ ఖాన్.



నెల్లూరు జిల్లా, కావలి, నిర్భయవార్త ప్రతినిధి :కావలి పట్టణం నివాసులైన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మరియు సంయుక్త సేవా సంస్థ సీనియర్ సభ్యులు పి ఐ జాఫర్ ఖాన్ నేడు వారి సతీమణి వహిదా రెండవ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణం చెరువు కట్ట గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం చేశారు. పై కార్యక్రమంలో దాత పి ఐ జాఫర్ ఖాన్ , వారి కుమారుడు పి ఫిరోజ్ ఖాన్, కుమార్తె అల్లుడు డాక్టర్ పి సల్మా – డాక్టర్ ఇస్మాయిల్ ఖాన్ లు, కోడలు అస్మా, పెద్ద కుమార్తె సయిదా బాను ,దాత తమ్ముడు పి.నవాజ్ ఖాన్ మరియు వారి కుమారుడు పి.ఆబిద్ ఖాన్ , సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేసిన పి ఐ జాఫర్ ఖాన్ మాట్లాడుతూ తన భార్య తనకు దూరమై తీరని భాధను కలిగించిందని అన్నారు.తన కుటుంబ అభివృద్ధి కోసం, పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో శ్రమించిందని గుర్తుచేసుకున్నారు.తను ఎక్కడ ఉన్నా ఆమె ఆత్మకు శాంతి కలగాలని పేదలకు సేవలందిస్తూ ఉన్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమ పిల్లలు,మనవళ్ళు, మనవరాళ్లు పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన పి ఐ జాఫర్ ఖాన్ కి వారి కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.అలాగే వహిదా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు.

## పెన్షన్ భరోసా లో వివక్ష ఎందుకు.




కంచికచర్ల ,నిర్భయవార్త ప్రతినిధి : కంచికచర్ల కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన వెన్నుపోటు పెన్షన్ భరోసా పథకంలో భాగంగా స్థానిక కంచికచర్ల సచివాలయం 2 నందు లబ్ధిదారులుకు సరైన వసతులు లేక సర్వర్ సరిగా పనిచేయక ఆన్లైన్ విధానంలో వివక్ష చూపుతున్నారని సమాచారం అందిన వెంటనే స్పందించిన కంచికచర్ల పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వేమా సురేష్ బాబు వెంటనే సచివాలయంకు వచ్చి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని లబ్ధిదారులకు సరైన సౌకర్యాలు కల్పించవలసిందిగా మరియు పెన్షన్ ఆన్లైన్ విధానంలో వివక్ష చూపకూడదని ప్రతి ఒక్కరికి పారదర్శకంగా లబ్ధి చేకూరాలని అధికారులను కోరడమైనదిఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం.

పొన్నూరు,మధిర, నిర్భయవార్త ప్రతినిధి : మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, మధిర పట్టణంలోని "ఆదరణ వృద్ధుల ఆశ్రమం" నందు ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.బాపట్ల బ్రాంచ్ (పొన్నూరు) ఎల్.ఐ.సి డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీ మన్నవ కిరణ్ కుమార్ గారి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కిరణ్ కుమార్ శిష్యురాలు గోపిశెట్టి భూలక్ష్మి ఆర్థిక సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ... పుట్టినరోజు నాడు వృద్ధాశ్రమంలోని నిరుపేదలకు, వృద్ధులకు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. సముచిత రీతిలో స్పందించి ఈ కార్యక్రమానికి సహకరించిన గోపిశెట్టి భూలక్ష్మికి సంస్థ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆదరణ వృద్ధుల ఆశ్రమ నిర్వాహకురాలు నిస్సి వాల్మీకి, ఆశ్రమ సభ్యులు మరియు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని, మన్నవ కిరణ్ కుమార్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.





# ఆ చిల్లు బుగ్గల్లో లావణ్యను- ఆ అల్లరిలో వరుణ్‌ని చూస్తారు!

వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠి దంపతులు మొదటిసారిగా వాయువ్ లుక్ తో ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసారు. ఎవరైనా పసిబిడ్డ ఈ భూమ్మీదికి రాగానే -ఎవరి పోలిక? మమ్మీలా ఉన్నాడా? డాడీలా ఉన్నాడా?- అంటూ ముచ్చటించుకోవడం సహజం. ఇప్పుడు మెగా వారసుడు వాయువ్ తేజ్ ముఖాన్ని మొదటిసారి చూసిన తర్వాత మెగా అభిమానులు కూడా సరిగ్గా ఇదే రీతిలో తెగ మురిసిపోతున్నారు. 10 సెప్టెంబర్ 2025న జన్మించిన తమ ముద్దుల కుమారుడి మొదటి పుట్టినరోజు సందర్భంగా.. వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠి దంపతులు మొదటిసారిగా వాయువ్ లుక్ తో ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసారు. జెన్ జీ మెగా ప్రిన్స్ నవ్వుతున్న ముఖం ఎంతో క్యూట్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపిస్తుండటంతో నెట్టింట ఈ ఫోటోలు వైరల్ గా దూసుకెళుతున్నాయి తమ కుమారుడి మొదటి పుట్టినరోజు సందర్భంగా వరుణ్ తేజ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఎమోషనల్ సందేశం అందరి హృదయాలను గెలుచుకుంది. --నా ప్రియమైన బాబు.. నువ్వు నా ప్రపంచాన్ని ఎంతో అందంగా మార్చేశావు. నిన్ను మొదటిసారి నా కళ్లతో చూడకముందే నీతో ప్రేమలో పడ్డాను. నీకు తండ్రిని కావడం నా జీవితంలోనే అత్యంత అందమైన ఘట్టం-- అంటూ వరుణ్ తన ఆనందాన్ని షేర్ చేసారు. నవంబర్ 2023లో వివాహబంధంతో ఒకటైన ఈ జంట... రెండేళ్ల తర్వాత తమ జీవితంలోకి అడుగుపెట్టిన చిన్నారితో తండ్రిగా.. తల్లిగా కొత్త అనుభూతిని ఆస్వాధిస్తున్నారు. చిన్నారి వాయువ్ ముఖం చూసిన అభిమానులు అతడి పోలికలపై కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా వాయువ్ నవ్వుతున్నప్పుడు పడే సొట్ట బుగ్గలు (డింపుల్స్) అచ్చం వాళ్ల అమ్మ లావణ్య త్రిపాఠిలా ఉన్నాయని.. కళ్లు - ముఖకవళికలు చిన్ననాటి వరుణ్ తేజ్‌లా ఉన్నాయని నెటిజన్లు పోలుస్తున్నారు. ఈ వేడుక సందర్భంగా ఉపాసన కామినేని కొణిదెల, నిహారిక కొణిదెల, సుస్మిత కొణిదెలతో పాటు పి.వి. సింధు, సంగీత దర్శకుడు థమన్, లక్ష్మీ మంచు, వితిక షేరు, రీతికా నాయక్ వంటి పలువురు సినీ, క్రీడా ప్రముఖులు కామెంట్ సెక్షన్ ద్వారా వాయువ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఒకవైపు వ్యక్తిగత జీవితంలో తండ్రిగా ఈ తీపి క్షణాలను ఆస్వాధిస్తూనే వరుణ్ తేజ్ తన సినీ కెరీర్‌ను కూడా ఎంతో ఆసక్తికరంగా ముందుకు తీసుకెళున్నారు. ఇటీవల మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వచ్చిన -కొరియన్ కనకరాజు- అనే ఇండో-కోరియన్ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ కథానాయకుడిగా అలరించారు. రాయలసీమకు చెందిన యువకుడికి దయ్యం పట్టడం.. తద్వారా కోరియన్ భాష మాట్లాడుతూ యాక్షన్ సీన్స్ చేయడం అనే విభిన్నమైన కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అల్లరి నరేష్ ఎమోషనల్ జర్నీ! ప్రస్తుతం వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం -భారీ- (దీప్త్రుతీఅ) పనుల్లో బిజీగా ఉన్నారు. యదు వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో వాలీబాల్ క్రీడ ఆధారంగా తెరకెక్కుతోందని గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. పాన్-ఇండియా ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తుండగా.. ధనుష్ భాస్కర్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. కెరీర్‌లో విభిన్నమైన సినిమాలు చేస్తూనే.. కుటుంబంతో ఇలాంటి అరుదైన సెలబ్రేషన్స్ చేసుకోవడం వరుణ్ కే చెల్లింది. ఇది మెగా అభిమానులకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.



# బాలయ్య స్టైంత్.. ఇప్పుడు అదే పెద్ద టెన్షన్!


కానీ ఇప్పుడు బాలయ్య స్ట్రెంత్.. ఆయన కొత్త సినిమాకు టెన్షన్ గా మారుతోంది. భారీ యాక్షన్ తో తెరకెక్కనున్న చీదీఖ112 విషయంలో అసలు సవాల్ ఇదేనని టాక్ వినిపిస్తోందిబాలయ్య సినిమాలో ఫైట్ అంటే.. ఫ్యాన్స్ కు పండగే. ఆయన ఒక్కసారి రంగంలోకి దిగితే యాక్షన్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా ఫైట్ సీన్లలో డూప్ కంటే తానే చేయడానికి ఎక్కువగా ఇష్టపడతారు. కానీ ఇప్పుడు బాలయ్య స్ట్రెంత్.. ఆయన కొత్త సినిమాకు టెన్షన్ గా మారుతోంది. భారీ యాక్షన్ తో తెరకెక్కనున్న చీదీఖ112 విషయంలో అసలు సవాల్ ఇదేనని టాక్ వినిపిస్తోంది. బాలకృష్ణతో కొరటాల శివ చేస్తున్న ఆ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈసారి బాలయ్యను ఇప్పటివరకు చూడని రేంజ్ లో చూపించాలని కొరటాల ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే కథలో యాక్షన్ ఎపిసోడ్స్ కు చాలా ఇంపార్టెన్స్ ఇచ్చినట్లు సమాచారం. సాధారణంగా కొరటాల సినిమాల్లో కథ, హీరో క్యారెక్టర్, ఒక స్ట్రాంగ్ పాయింట్ చుట్టూ స్టోరీ ఉంటుంది. కానీ చీదీఖ112లో మాత్రం యాక్షన్ దే ఎక్కువ హవా ఉండనుందని సమాచారం. ఇప్పటికే కొరటాల సిద్ధం చేసిన కథలోని యాక్షన్ ఎలిమెంట్స్ బాలయ్యకు కూడా బాగా నచ్చాయట. అంటే సినిమా మొదలైతే ఫ్యాన్స్ కు కావాల్సిన మాస్ ట్రీట్ గ్యారెంటీ అన్నమాట. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. భారీ యాక్షన్ సీన్లు అంటే హీరోకు కూడా అంతే రేంజ్ లో ఫిజికల్ స్ట్రెయిన్ ఉంటుంది. అందుకే ఇలాంటి సీన్స్ లో సాధారణంగా బాడీ డబుల్స్ యూత్ చేస్తారు. కానీ బాలయ్య మాత్రం తన యాక్షన్ ను తానే చేయడానికి ఇష్టపడతారు. డూప్ తో చేయించడం ఆయనకు పెద్దగా నచ్చదు. ఫైట్ లో హీరో కనిపిస్తే వచ్చే ఆ ఇంపాక్ట్ వేరే లెవల్ లో ఉంటుందని ఆయన నమ్ముతారు. అయితే ఇటీవల బాలయ్యకు గాయం కావడం, ఆపరేషన్ జరగడంతో పరిస్థితి మారింది. ప్రస్తుతం ఆయన రెస్ట్ తీసుకుంటున్నారు. ఎక్కువ ఫిజికల్ స్ట్రెయిన్ తీసుకోవద్దని డాక్టర్లు సజెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పుడు కొరటాల ముందున్న ప్రశ్న ఒక్కటే.. యాక్షన్ ను ఎలా డిజైన్ చేయాలి? అన్నదే..ఎందుకంటే యాక్షన్ తగ్గిస్తే బాలయ్య సినిమా అనే ఫీల్ తగ్గే ఛాన్స్ ఉంది. భారీగా చేస్తే హీరోపై ప్రెజర్ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు డూప్ ను యూజ్ చేయడం కూడా బాలయ్యకు అంతగా ఇష్టం లేదు. దీంతో ఆ మూడు విషయాల మధ్య బ్యాలెన్స్ చేయాల్సిన బాధ్యత కొరటాలపై పడింది. ప్రస్తుతం చీదీఖ112 ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. డిసెంబర్ లో షూటింగ్ మొదలు పెట్టాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అప్పటికి బాలయ్య పూర్తిగా కోలుకుని షూటింగ్ కు సిద్ధం కావాల్సి ఉంటుంది. అంతేకాదు.. యాక్షన్ సీన్ల విషయంలో చాలా జాగ్రత్తగా ప్లాన్ చేయాల్సి ఉంటుంది.


# ఇరుముడికి గణేష్ బోనస్.. రేట్లు తగ్గిస్తే?

ఈ శుక్రవారం నుంచి ఆదివారం వరకు వీకెండ్ ఉంది. వెంటనే సోమవారం వినాయక చవితి సెలవు వస్తోంది. అంటే ఇరుముడికి వరుసగా నాలుగు రోజులు ఉపయోగపడే అవకాశం ఉంది. ఇరుముడి రిలీజ్ అయ్యి మూడు వారాలు పూర్తయ్యాయి. 21 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.225 కోట్ల గ్రాస్ దగ్గరకు చేరినట్లు ట్రేడ్ టాక్. 20వ రోజుకూ దేశవ్యాప్తంగా దాదాపు రెండు వేల షోలలో సినిమా నడిచింది. అది కూడా మూడో వారంలో. మొదటి వారం తర్వాత కూడా సినిమా నిలబడటం వల్ల రవితేజ కెరీర్‌లో గుర్తుండే రన్‌గా మారింది. కానీ టీమ్ ఇక్కడితో ఆపేలా కనిపించడం లేదు. ఈమధ్య మరోసారి సక్సెస్ సెలబ్రేషన్ చేసిన తర్వాత ఇప్పుడు వచ్చే వీకెండ్‌ను కూడా వాడుకోవాలనే ప్రయత్నం కనిపిస్తోంది. ఈ శుక్రవారం నుంచి ఆదివారం వరకు వీకెండ్ ఉంది. వెంటనే సోమవారం వినాయక చవితి సెలవు వస్తోంది. అంటే ఇరుముడికి వరుసగా నాలుగు రోజులు ఉపయోగపడే అవకాశం ఉంది. కొత్త సినిమాలు థియేటర్లలోకి వచ్చినా హైదరాబాద్‌లో పీవీఆర్, ఏఎంబీ, ప్రసాద్స్ సహా పలు మల్టీప్లెక్స్‌లలో ఇంకా షోలు కొనసాగుతున్నాయి. బుకింగ్స్ కూడా ఈ వీకెండ్ వరకు ఓపెన్‌లో ఉన్నాయి. మూడు వారాల సినిమా అయినా పూర్తిగా సైడ్ కాలేదనే అనిపిస్తోంది. ఇరుముడికి ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా బాగా కలిసొచ్చారు. అయ్యప్ప దీక్ష, తండ్రి కూతురు ఎమోషన్ కారణంగా మాస్ సెంటర్లతో పాటు అర్బన్ ఏరియాల్లో కూడా వయసైన ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్న వీడియోలు కనిపించాయి. సాధారణంగా రవితేజ సినిమాకు వచ్చే యూత్, మాస్ ఆడియెన్స్‌కు అదనంగా ఈ సెక్షన్ రావడం వల్లే లాంగ్ రన్‌కు కొంత సపోర్ట్ దొరికింది. ఇప్పటికీ అలాంటి ఆడియెన్స్‌లో సినిమా చూడని వాళ్లు ఉండే అవకాశం ఉంది. ఇప్పుడు మరోసారి ఫుట్‌ఫాల్స్ పెంచాలంటే టికెట్ రేట్లు కూడా ఉపయోగపడొచ్చు. మూడు వారాలు పూర్తయిన సినిమాకు కొన్ని షోలు లేదా సెలెక్ట్ చేసిన థియేటర్లలో ధరలు తగ్గిస్తే ఇంకా చూడని ఫ్యామిలీస్‌కు పుష్ ఇచ్చినట్లు అవుతుంది. ముఖ్యంగా మల్టీప్లెక్స్‌లో కుటుంబం మొత్తం వెళ్లినప్పుడు టికెట్లతో పాటు ఫుడ్, పార్కింగ్ ఖర్చు కూడా ఉంటుంది. అలాంటి చోట చిన్న తగ్గింపు కూడా నిర్ణయాన్ని మార్చే అవకాశం ఉంది. అలాగే రిపీట్ ఆడియెన్స్. భక్తి టచ్ ఉన్న సినిమా కావడంతో వినాయక చవితి సమయంలో మళ్లీ చూడాలనుకునే వాళ్లు కూడా ఉండొచ్చు. పైగా సోమవారం సెలవు ఉండటం వల్ల ఆదివారంతో వీకెండ్ రన్ ఎండ్ అవ్వదు. శనివారం, ఆదివారం ఆక్యుపెన్సీ పెరిగితే సోమవారం కూడా థియేటర్లు షోలు అలాగే కొనసాగించే అవకాశం ఉంటుంది. కొత్త రిలీజ్‌ల మధ్య ఇది సినిమాకు ఉపయోగపడే చాన్స్. ఇంకా థియేటర్‌కు రాని ప్రేక్షకులను తీసుకురావడానికి ఈ నాలుగు రోజులు మంచి టైమ్. టీమ్ నిజంగా టికెట్ రేట్లపై ఏదైనా ఆఫర్ తీసుకొస్తుందా అనేది చూడాలి. అలా జరిగితే గణేష్ హాలీడే ముగిసే సమయానికి ఫుట్‌ఫాల్స్‌లో మరో జంప్ రావచ్చు.




# బ్యాక్ ఫీటు బావుందమ్మోవ్.. మైకోనోస్ బీచ్ అదిరిందమ్మోవ్.. ప్రగ్య రచ్చ రచ్చ!









గ్లామరస్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ కెరీర్ జర్నీ, లైఫ్ స్టైల్ గురించి తెలుగు వారికి పరిచయం చేయనవసరం లేదు.గ్లామరస్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ కెరీర్ జర్నీ, లైఫ్ స్టైల్ గురించి తెలుగు వారికి పరిచయం చేయనవసరం లేదు. కంచె సినిమాతో డెబ్యూ ఇచ్చిన ఈ బ్యూటీ జర్నీ ఇటీవల పూర్తిగా స్లో అయిపోయింది. నేను స్లో అంటూ అంగీకరిస్తూనే.. ఈ బ్యూటీ సోషల్ మీడియాలలో నిత్యం యమ ఫాస్ట్ గా ఉంది. రెగ్యులర్ గా తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో కుర్రకారు కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తోంది. తాజాగా ఈ భామ గ్రీస్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మైకోనోస్ నగరంలో విహరిస్తూ నెటిజనుల గుండెల్లో గుబులు పుట్టించింది. హాలో మైకోనోస్ అంటూ లవ్ ఈమోజీలతో రెచ్చిపోయింది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు, అభిమానులు ఈ అందమైన ఫోటోగ్రాఫ్స్‌పై లైకులు, కామెంట్లతో రీయాక్ట్ అవుతూ ట్రెండ్ చేస్తున్నారు. ఈ విహారయాత్రలో ప్రగ్యా ధరించిన అవుట్‌ఫిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. -స్టూడియో వెరాండా- డిజైన్ చేసిన స్టైలిష్ డిజైనర్ డ్రెస్‌లో ఎంతో గ్లామరస్‌గా కనిపించింది. దీనికి తోడు ఐ జ్యువెలరీ ఇయర్ రింగ్స్, -ఐ మోడ్- సన్ గ్లాసెస్, -ఫ్లటర్ ఫుట్‌వేర్-తో తన లుక్‌ను మరింత ట్రెండీగా మార్చుకుంది. ప్రముఖ స్టైలిస్ట్ నటాషా బోత్రా పర్యవేక్షణలో మిచెలా, మౌస్మి మిత్రాల బృందం ఈ బ్యూటీని ఎంతో అందంగా స్టైలింగ్ చేసారు. ఈ లుక్‌కు డిజైనర్ బ్రాండ్స్‌తో పాటు పలువురు సెలబ్రిటీలు సైతం కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపించారు. సినిమా ఆఫర్లు తగ్గినా ప్రగ్యా జైస్వాల్ గ్లోబ్ ట్యాగ్‌లా ప్రపంచ దేశాలన్నీ చుట్టేస్తోంది. కనీసం ప్రొఫెషనల్ ట్రావెల్ బ్లాగర్‌గా పాపులర్ కాకపోయినా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన ట్రావెలింగ్ అనుభవాలను, ఆయా ప్రాంతాల విశేషాలను అభిమానులతో షేర్ చేస్తోంది. గతంలో కూడా ఈ భామ యూరప్ ఖండంలోని పలు అందమైన దేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేక పర్యాటక ప్రాంతాలను సందర్శించి.. గ్లామరస్ ట్రావెల్ ఫోటోషూట్లతో వార్తల్లో నిలిచింది. ఇక టాలీవుడ్ కెరీర్ విషయానికి వస్తే.. ఇటీవలి కాలంలో ప్రగ్యాకు తెలుగులో అవకాశాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. -కంచె- సినిమాతో మెగా కాంపౌండ్ హీరో వరుణ్ తేజ్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకుని ఎన్బీకే సరసనా అవకాశాలు దక్కించుకున్నా కానీ.. ఆ తర్వాత ఆ స్థాయి అవకాశాలను అందుకోవడంలో వెనుకబడింది. బోయపాటి శ్రీను - నందమూరి బాలకృష్ణ కాంబినేషన్‌లో వచ్చిన -అఖండ- విజయం సాధించినా.. తన కెరీర్‌కు అది పెద్దగా మైలేజ్ ఇవ్వలేకపోయింది.

అగ్ర హీరోల సినిమాల్లో కొత్త నీరులా యంగ్ హీరోయిన్ల ఎంట్రీ పెరగడం కూడా ఈ సీనియర్ భామకు అవకాశాలు తగ్గడానికి ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. అల్లరి నరేష్ ఎమోషనల్ జర్నీ! సరైన హిట్ పడితే తప్ప టాలీవుడ్‌లో మళ్లీ పుంజుకోవడం కష్టమే అయినా ప్రగ్యా మాత్రం సోషల్ మీడియా గ్లామర్ ప్రదర్శనతో ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటోంది. కొత్త అవకాశాల కోసం వేచి చూస్తూనే.. మరోవైపు తన పర్సనల్ లైఫ్‌ను.. విహారయాత్రలను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. మునుముందు రోజుల్లో ఈ హాట్ బ్యూటీకి టాలీవుడ్ నుంచి ఎలాంటి అవకాశాలు వస్తాయో వేచి చూడాలి.

# 'ఫౌజీ' రిలీజ్ అయోమయం.. మళ్లీ డైలమాలో ఫ్యాన్స్..!

ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' చిత్రం డిసెంబర్ 3న విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించినప్పటికీ, ఆ తేదీకి సినిమా రావడంపై సినీ వర్గాల్లో తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చాలా పెండింగ్‌లో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.



ప్రభాస్ బల్క్ డేట్స్ ఇవ్వడం, సమాంతరంగా షూటింగ్ జరపడం వల్ల మేకర్స్ ధీమాగా ఉన్నప్పటికీ, డిసెంబర్ 4న దుల్కర్ సల్మాన్ 'శ్రీశ్రీ', విశ్వక్‌సేన్ 'లెగసీ', నాగచైతన్య 'వృషకర్మ' చిత్రాలు రిలీజ్ డేట్స్ లాక్ చేసుకోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ప్రభాస్ లాంటి భారీ స్టార్ సినిమా పోటీలో ఉంటే ఇతర సినిమాలు ఇలా పోటీకి రావు కాబట్టి, 'ఫౌజీ' వాయిదా పడటం దాదాపు ఖాయమని ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది.ఒకవేళ 'ఫౌజీ' డిసెంబర్ రేస్ నుంచి తప్పుకుంటే, సంక్రాంతి షెడ్యూల్స్ ఇప్పటికే ఫిక్స్ అవ్వడం, ఆపై పరీక్షల సీజన్ మొదలవుతుండటంతో మళ్లీ వచ్చే సమ్మర్ వరకు సరైన రిలీజ్ డేట్ దొరకడం కష్టమేనని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరి ఈ రిలీజ్ అయోమయంపై 'ఫౌజీ' మేకర్స్ ఎప్పుడు క్లారిటీ ఇస్తారో చూడాలి.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197